



విధానసౌధలో కన్నడమాత భువనేశ్వరీదేవి విగ్రహం వద్ద సీఎం, డీసీఎం తదితరులు

ప్రపంచస్థాయిలో.. రాణించాలి

- కృత్రిమ మేధస్సును మించి కన్నడ ఎదగాలి
- ప్రాథమిక స్థాయిలో మాతృభాష సముచితం
- ప్రతి కన్నడిగుడికి రాజ్యోత్సవం గర్వకారణం
- కంఠీరవ వేదికపై సీఎం సిద్దరామయ్య



ప్రసంగిస్తున్న సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచమంతటా కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికత గురించి చర్చలు సాగుతున్నాయని, వాటికి మించి కన్నడ కొత్త సాంకేతికత భాషగా తీర్చేందుకు నిపుణులు సిద్ధం కావాలని సీఎం సిద్దరామయ్య పిలుపునిచ్చారు. కన్నడ సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో కంఠీరవ స్టేడియంలో ఏర్పాటు చేసిన కర్ణాటక రాజ్యోత్సవంలో సీఎం ముఖ్యులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి సీఎం మాట్లాడారు. 800 కన్నడ పాఠశాలలను, 100 ఉర్దూ పాఠశాలలను కర్ణాటక పబ్లిక్ స్కూల్ (కేపీఎస్)గా మార్చామన్నారు. మదరసాలలో కన్నడ నేర్పించేందుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఏఐ సాంకేతికతతో రాష్ట్రంలో ఉద్యోగాల నష్టం కాకుండా మనభాషను కొత్త సవాళ్లను ఎదుర్కొనేలాంటి పరిశోధనలు అవసరమన్నారు. ఐటీ యుగం ప్రస్తుతం ఏఐ యుగంగా మారిందన్నారు. కన్నడ భాషాపరంపర, సంస్కృతి ప్రపంచస్థాయిలో రాణించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో వందేళ్లు పూర్తయిన మూడు వేల ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా అవసరాలను బట్టి రూ.2,500 కోట్లతో 800 పబ్లిక్‌స్కూల్‌లుగా మార్చి శాశ్వతభవనాలు నిర్మిస్తున్నామన్నారు. మైనారిటీ వర్గాల్లో చైతన్యం తీసుకురావాలని ప్రాథమికంగా కన్నడ భాషను మదరసాలలో నేర్పించదలిచామన్నారు. ప్రస్తుతం 180 మదరసాలలో కన్నడభాష నేర్పుతున్నామన్నారు. రాష్ట్రంలోని 1500 మదరసాలకు విస్తరింపచేయదలిచామన్నారు. 1956లో ఏకీకరణతో కర్ణాటక రాష్ట్రం ఏర్పడిందని, ప్రస్తుతం 70వ వసంతంలోకి అడుగు పెట్టామన్నారు. ఏకీకరణ పోరాటంలో మైసూరు విద్యార్థి రామస్వామి, బళ్ళారి రంజాన్‌సాబ్‌లను స్మరించుకోవాలన్నారు. ఏకీకరణ పోరాటానికి పునాదులు వేసినవారిలో ఆలూరు వెంకటరామయ్యతోపాటు ఎంతోమంది ఉన్నారన్నారు. బహుభాష, పలు మతాలు, సంస్కృతిని మన పూర్వీకులు కలసి ముందుకెళ్లారని ఆ పరంపర కొనసాగిద్దామన్నారు. వేలసంవత్సరాల ప్రాచీనచరిత్ర కల్గిన కన్నడ భాషను నిర్లక్ష్యం చేయకుండా ప్రపంచానికి విస్తరింపచేద్దామన్నారు. ఇంగ్లీష్, హిందీ భాషలు పిల్లల ప్రతిభకు అడ్డంకిగా మారుతున్నాయన్నారు. ప్రాథమిక చదువు మాతృభాషలో ఉండాలన్నారు. సమగ్ర అభివృద్ధి అంటే రోడ్లు, బ్రిడ్జ్‌లు, రైళ్లు, విమానం, ఆకాశాన్ని అంటే భవనాలు కాదని, పిల్లల మానసిక, శారీరక ఆరోగ్యంతోపాటు భిన్నత్వంలో ఏకత్వం ముఖ్యమన్నారు. బుకర్‌ప్రైజ్‌ను పొందడం ద్వారా బానుముస్తాక్, దీపా బాస్తిలు ప్రపంచవేదికకు తీసుకెళ్లారన్నారు. కేంద్రం సవతితల్లి ప్రేమతో మాకు అన్యాయం జరుగుతోందని 4.50 లక్షలకోట్లు పన్నులు రూపంలో కేంద్రానికి వెళ్తోంటే చిల్లరకాసులేనన్నారు. విద్యావ్యవస్థ బలోపేతానికి రూ.67 వేల కోట్లు కేటాయించామని, 8.63 లక్షలమంది హాస్టళ్లలో చదువుతున్నారన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తూ...



కంఠీరవ స్టేడియంలో కన్నడ పతాకంతో విద్యార్థులు



భువనేశ్వరి వేషధారణలో విద్యార్థి



పతాకానికి సీఎం, డీసీఎం వందనం

భారీగా పెరిగిన తలసరి ఆదాయం

క్యాన్సర్‌పీడిత చిన్నారులకోసం వైద్యంతోపాటు విద్యను అందించే ప్రత్యేక పాఠశాలను ప్రారంభించామని సీఎం అన్నారు. 2024లో 14,499 మంది ఉపాధ్యాయులను నియమించామన్నారు. స్టేట్ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకొచ్చామన్నారు. ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్‌లో మన రాష్ట్రం తొలిస్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో తలసరి ఆదాయం 101 శాతం ప్రగతి సాధించామన్నారు. కర్ణాటక గురించి మాట్లాడితే ఎంతైనా ఉందన్నారు. కన్నడ పోరాట నేతలను స్మరించుకోవాలన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం సిద్దరామయ్య, వాటాళ్ నాగరాజు తదితరులు

రాజీలేని పోరాట నేత వాటాళ్: సీఎం

కన్నడ సమస్యలపై వాటాళ్ నాగరాజ్ రాజీలేని పోరాటాన్ని కొనసాగిస్తున్నానన్నారు. మైసూరుబ్యాంకు సర్కిల్‌లో నృపతుంగమంటపలో భువనేశ్వరి, అణ్ణమ్మదేవిల ఊరేగింపును ప్రారంభించిన సందర్భంగా సీఎం మాట్లాడారు. మంత్రి పదవి ఇస్తానన్నా వాటాళ్ కన్నడ పోరాటం వీడడం లేదన్నారు. కన్నడ పోరాటనేతలపై ఉండే కేసులను తొలగిస్తామని ప్రకటించారు. మనమంతా కన్నడ నేల, నీరు, భాష, సంస్కృతి పట్ల అభిమానం కల్గినవారమన్నారు. ఏ భాషలో మాట్లాడేవారైనా కన్నడలోనే వివరణ ఇవ్వాలని ప్రతిజ్ఞ చేద్దామన్నారు. మాజీ సీఎం దేవరాజ్ అరసుకు మరణానంతరం మైసూరు వర్సిటీ నుంచి డాక్టరేట్ ఇవ్వాలన్న వాటాళ్ నాగరాజ్, సారా గోవిందుల ప్రతిపాదనలను సిండికేట్ సభ్యులతో చర్చిస్తానన్నారు. తనకు డాక్టరేట్ ఇస్తామని గతంలోనే తెలిపారని అయితే చదివి జ్ఞానాన్ని పెంచుకుని డాక్టరేట్ పొందాలనేది నా వ్యక్తిగత అభిప్రాయమన్నారు. మహారాష్ట్ర ఏకీకరణ సమితి (ఎంఈఎస్) వివాదాలు సృష్టిస్తే మట్టి కరిపిస్తామని హెచ్చరించారు.



రాజ్యోత్సవ పురస్కార గ్రహీతలతో సీఎం, డీసీఎం



కన్నడ పతాకంతో కవాతు



బాబుకు పేరు పెడుతున్న డీసీఎం డీకే శివకుమార్

బుజ్జి శివకుమార్

- కుడచి ఎమ్మెల్యే కుమారుడికి డీసీఎం పేరు
- స్వయంగా నామకరణం చేసిన డీకే శివకుమార్

బెంగళూరు, నవంబరు1(ఆంధ్రజ్యోతి): డీసీఎం డీకే శివకుమార్ బాబుకు స్వయంగా పేరు పెట్టారు. బెళగావి జిల్లా కుడచి కాంగ్రెస్ ఎమ్మెల్యే మహేంద్ర తమ్మణ్ణనవర్ కుమారుడికి శుక్రవారం డీసీఎం డీకే పేరు పెట్టారు. ఎమ్మెల్యే కోరిక మేరకు ఆయన చిన్నారికి శివకుమార్ అని పేరు పెట్టారు. ఈ సందర్భంగా డీసీఎం మాట్లాడుతూ ఇది ఎంతభాగ్యం, ఓ చిన్నారికి పేరు పెట్టే అవకాశం వచ్చిందని, అది కూడా తన పేరే పెట్టడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో చిన్నారి తనకంటే ఎత్తుకు ఎదగాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సోమేశ్వర ఆలయంలో కార్తీక ఏకాదశి పూజలు

ముళబాగిలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రసన్న సోమేశ్వర దేవాలయంలో కార్తీక శనివారం ఏకాదశి పురస్కరించుకుని స్వామికి విశేషపూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, విశేష పుష్పాలంకరణ ఇతర ధార్మిక కైంకర్యాలు అర్చకులు రామనాథ్ దీక్షిత్ నేతృత్వంలో సాగాయి. భక్తులు విశేషంగా తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



ప్రసన్న సోమేశ్వరస్వామి

ముగిసిన కులగణన

- 10వరకు ఆన్‌లైన్‌లో నమోదుకు వెసులుబాటు
- 4.22 లక్షల మంది సర్వే తిరస్కరణ
- 34.49 లక్షల ఇళ్లకు తాళాలు



చివరి రోజు నగరంలో సర్వే చేపట్టిన ఎన్యుమరేటర్లు

బెంగళూరు, నవంబరు1(ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, విద్య పరమైన సమగ్ర సమాచారం తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెండోసారి చేపట్టిన కులగణన సర్వే పూర్తయ్యింది. అక్టోబరు 31 శుక్రవారం సాయంత్రంతో రాష్ట్రవ్యాప్తంగా కులగణన సర్వే ముగిసిందని బీసీ కమిషన్ ప్రకటించింది. అయితే ఈనెల 10వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా సమగ్ర వివరాల నమోదుకు వెసలుబాటు కల్పించారు. సర్వే ముగియడంతో వివరాలు క్రోడీకరించి ఈ ఏడాది ఆఖరుకు తుది నివేదికను ప్రభుత్వానికి అందజేసే అవకాశం ఉంది. అయితే రాష్ట్రంలో కులగణన సర్వే సంపూర్ణంగా కాలేదు. ఏకంగా 38 లక్షల ఇళ్లకు సంబంధించిన సమాచారం నమోదు కాలేదు. ఇప్పటివరకు జరిగిన సర్వేకు సంబంధించిన సమగ్ర వివరాలు ఆప్‌లో లోడ్ చేశారు. ప్రాథమిక, ద్వితీయ గణాంకాలను క్రోడీకరించి విశ్లేషణ చేసి గణాంకాలను సిద్ధం చేయాలని నిర్ణయించారు.

38 లక్షల మంది దూరం

రాష్ట్ర జనాభా 2025నాటికి 6,85,38,000మంది ఉండగా సర్వే పూర్తయ్యేసరికి 6,13,83,908మంది వివరాలు తెలిపారు. 4,28,908 మంది సర్వేను వ్యతిరేకించారు. 34,49,681మంది ఇళ్లు ఖాళీగా లేదా తాళాలు వేసినట్టుగా గుర్తించారు. 38 లక్షలమందికిపైగా సర్వేలో పాల్గొనలేదు.

- 2011లో కులగణన నివేదికను హెచ్ కాంతరాజ్ కమిషన్ 2015 నాటికి సమగ్ర గణాంకాలను సిద్ధం చేసింది. అప్పట్లో బీసీ కమిషన్ చైర్మన్‌గా వ్యవహరించిన జయప్రకాశ్ హెగ్డే 2015లో కాంతరాజ్ కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా సిఫారసులను సద్వినియోగం చేసుకోవాలని తీర్మానించారు. కాంతరాజ్ నేతృత్వంలోని సర్వే నివేదిక మూలప్రతులు బీసీ కమిషన్‌లో ఉన్నాయి. అయితే 2018లో ప్రభుత్వం మారడంతో సర్వే వివరాలకు అనుగుణంగా అమలు చేసేందుకు వెనుకడుగు వేశారు. ఇటీవల 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మళ్లీ బీసీ కమిషన్ సదరు నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. ఈ ఏడాది ప్రారంభంలో ప్రభుత్వం నివేదికను స్వీకరించినా క్యాబినెట్‌లో ఆమోదానికి అభ్యంతరం తెలెత్తింది. ప్రధానంగా ఒక్కలిగ, లింగాయత సామాజికవర్గానికి చెందినవారి జనాభా తక్కువ చూపారని రెండు సామాజికవర్గాల సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. పరిస్థితి తారస్థాయికి చేరడంతో అధిష్ఠానం కట్టె విరగకుండా పాము చావకుండా అనేరీతిలో వ్యవహరించి పదేళ్ల క్రితం జరిగిన సర్వే ఆధారంగా ఎటువంటి ప్రయోజనం ఉండదని, భారీగా మార్పులు చోటు చేసుకుని ఉంటాయని స్పష్టి పలికారు. దీంతో రెండోసారి సర్వే చేపట్టిన విషయం తెలిసిందే.
- 15రోజుల్లో సర్వే పూర్తి చేయాలని తీర్మానించారు. అయితే మొబైల్ యాప్ ద్వారా సర్వే జరుగుతున్నందున కొన్ని ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యతోపాటు పలు అడ్డంకులు తగలడంతో రెండుసార్లు గడువు పొడిగించారు. ఇలా శుక్రవారంతో సర్వే పూర్తి చేశారు. ఎన్యూమరేటర్లు సేకరించిన వివరాలలో మతం, కులం, ఉపకులం, జనాభా గుర్తించేందుకు ప్రాథమిక వివరాలు నిర్ణయాత్మకం కానున్నాయి. సామాజిక స్థితిగతులు, ఆర్థిక, ఉద్యోగం, ప్రభుత్వ ఉద్యోగం, రాజకీయ ప్రాతినిధ్యం వంటి గణాంకాలను పొందుపరిచారు. బీసీ కమిషన్ అడిగిన 60 ప్రశ్నలకు పైగా 30 అంశాలకు సమగ్ర సమాచారం సాధ్యమైంది. మిగిలిన 30 ప్రశ్నలను ప్రతి వ్యక్తితోనూ ఎన్యూమరేటర్లు ప్రస్తావించలేదని, కొన్నిచోట్ల వివరాలు ఇవ్వలేదని తెలుస్తోంది. ప్రస్తుత సమాచారం ప్రకారం కులం, ఉపకులాల కేటగిరీలో స్పష్టంగా తెలియనుంది.
- సాంకేతిక సమీక్ష నికర గణాంకాల ఆధారంగా బీసీ కమిషన్ సమర్పించే నివేదిక ప్రకారం బీసీ వర్గాలకు రిజర్వేషన్ ప్రమాణం పెంపొందించాలని, కనీసం 75శాతం రిజర్వేషన్లు పెంచాలని కేంద్రప్రభుత్వానికి కోరదలిచారు. అయితే బీసీ కులాలు పెరిగాయని, అటువంటి గణాంకాలను ఆధారంగా చేసుకుని 50శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేయడం అసాధ్యమని తెలంగాణ ప్రభుత్వానికి ఇటీవలే సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. చట్ట సవరణ చేసి ప్రత్యామ్నాయమైన విధానాలను పాటించరాదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం కోర్టు సూచించింది. రాష్ట్రంలో కులగణన సర్వే పూర్తయినా వివరాల ప్రకారం బీసీ కులాల జనాభా పెరిగినా రిజర్వేషన్లు పెంచుకునేందుకు వెసలుబాటు లేదు. ఒకవేళ ప్రభుత్వం బూచి చూపి వెనుకబడినవర్గాలను ఆకట్టుకునే ప్రయత్నం చేసినా తెలంగాణ ప్రభుత్వానికి ఎదురైన చేదు అనుభవమే సుప్రీం కోర్టులో ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతన్నారు. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందో వేచి చూడాల్సిందే.

భక్తరహళ్లి చెరువుకు వాయనం సమర్పించిన మంత్రి



వాయనం సమర్పిస్తున్న మంత్రి సుధాకర్

చింతామణి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): చింతామణి పట్టణానికి నీటిని సరఫరా అందించే రెండో చెరువు భక్తరహళ్ళి అరసన కెరెకు మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ వాయనం సమర్పించారు. శనివారం మంత్రి స్వయంగా వాయనం సమర్పించారు. తొలుత సంప్రదాయంగా పూజలు చేశారు. తాలూకా యంత్రాంగం, తాలూకా పంచాయతీ, నగరసభ, చింతామణి సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం సాగింది. వాయనం అనంతరం మంత్రి మాట్లాడుతూ చెరువు మరవ పారుతున్నందున వాయనం సమర్పించామని, పూర్వీకులు నిర్మించిన చెరువు అభివృద్ధి చేయడానికి రూ.36కోట్లు గ్రాంటు విడుదలైందని త్వరలోనే పనులు జరుగుతాయన్నారు. తహసీల్దార్ సుదర్శన్ యాదవ్, డీఎస్పీ మురళీధర్, తాలూకా పంచాయతీ ఈఓ ఆనంద్, నగరసభ కమిషనర్ చలపతి తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న రాయచూరు జిల్లా నాయకులు

రెండో పంటకు నీరివ్వండి

- మంత్రి శరణప్రకాశ్ పాటిల్‌కు నేతల వినతి

9

రామనగర హోంస్టేలో భారీ పార్టీ

- పోలీసుల అదుపులో 130మంది

బెంగళూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రామనగర జిల్లా పరిధిలోని అయాన్ హోంస్టేలో శుక్రవారం రాత్రి పొద్దుపోయాక పోలీసులు దాడి చేశారు. అనుమతి లేకుండా పార్టీ జరుగుతోందని పోలీసులు దాడి చేశారు. 130మంది యువతీ యువకులను అదుపులోకి తీసుకున్నారు. పార్టీలో పాల్గొన్నవారంతా బెంగళూరుకు చెందినవారుగా గుర్తించారు. ఇక్కడ రేవ్‌పార్టీ జరిగిందనే అనుమానంతో వారందరికీ మెడికల్ టెస్టులు చేయించారు. కగ్గలిపుర పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. వాట్సప్ గ్రూప్ ద్వారా పార్టీకి ఆహ్వానించినట్టు గుర్తించారు. 19-23ఏళ్ల యువతీ యువకులు భాగస్వామ్యులయ్యారు. జెన్ జీ అనే గ్రూప్ ద్వారా అందరికీ సందేశాలు పంపారు. పార్టీలో పాల్గొన్నవారిలో 35మంది యువతులు, ముగ్గురు మైనర్లు, 70మందిదాకా యువకులు ఉన్నారు. వీరిలో ఎక్కువమంది మద్యం సేవించినవారు కాగా కొందరు డ్రగ్స్ తీసుకున్నారనే అనుమానంతోనే మెడికల్ టెస్టులు చేయించి వారి చిరునామాలు తీసుకుని పంపినట్టు జిల్లా ఎస్పీ శ్రీనివాసగౌడ తెలిపారు. డ్రగ్స్ తీసుకున్నట్టు నిర్ధారణ అయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఒకే సారి భారీగా పోలీసులు అదుపులోకి తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

కాలువలో పడి విద్యార్థి మృతి


పృథ్వీరాజ్ (ఫైల్)

పెద్దవడుగూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్షుంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పృథ్వీరాజ్ (14) శనివారం యాడికి కాలువలో పడి మృతి చెందాడు. బుర్నాకుంట గ్రామానికి చెందిన పృథ్వీరాజ్ బంధువుల వివాహం నేపథ్యంలో గత రెండురోజులుగా పాఠశాలకు వెళ్లలేదు. తల్లి శశికళ శనివారం పొలం పనికి వెళ్లడంతో ఆమెకు భోజనం తీసుకుని ఆ బాలుడు బయల్దేరాడు. అయితే యాడికి కాలువ వంతెన దాటే సమయంలో ప్రమాదవశాత్తు జారి నీటిలో పడ్డాడు. అక్కడ ఉన్న కొందరు గమనించి పృథ్వీరాజ్‌ను బయటకు తెచ్చారు. అప్పటికే బాలుడు మృతి చెందాడు. ఇప్పటికే భర్తను పోగొట్టుకుని బతుకుతున్న ఆ తల్లి కుమారుడి మృతితో కుప్పకూలిపోయింది. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

గార్లదిన్నె, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బాలికను వంచించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ గౌస్ బాషా తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలానికి చెందిన ఓ బాలిక ఇంటర్మీడియట్ వరకు చదువుకుని, అనంతపురంలో ఓ దుస్తుల దుకాణంలో పనిచేస్తుండేది. కొన్ని నెలల క్రితం ఓ వివాహ కార్యక్రమంలో పామిడి మండలం పాళ్యం తండాకు చెందిన సురేష్ నాయక్ పరిచయం అయ్యాడు. వివాహం చేసుకుంటానని సురేష్ మాయమాటలు చెప్పి.. లోబరుచుకున్నాడు. మూడురోజుల క్రితం బాలికకు కడుపునొప్పి రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లారు. గర్భం దాల్చినట్లు తేలింది. విషయం తెలుసుకున్న యువకుడు పరారయ్యాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సురేష్ నాయక్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్కూటీలో ఉంచిన రూ.ఆరు లక్షలు చోరీ

గుత్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్ఎస్‌లోని అయ్యప్పస్వామి దేవాలయం వద్ద స్కూటీలో ఉంచిన రూ.ఆరు లక్షలు చోరీ అయినట్లు బాధితుడు ఓబులేసురెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెద్దవడూగురు మండలం కాశేపల్లి గ్రామానికి చెందిన ఓబులేసురెడ్డి గత కొంతకాలంగా స్థానిక బీసీ కాలనీలో నివాసముంటున్నాడు. చేసిన అప్పులు తీర్చడం కోసం భూమిని విక్రయించాడు. వచ్చిన డబ్బును రుణదాతలకు ఇచ్చేందుకు తన స్కూటీ డిక్కిలో రూ. 6లక్షలు ఉంచుకుని బయల్దేరాడు. అయ్యప్పమాల ధరించి ఉండటంతో స్వామిని దర్శనం చేసుకునేందుకు అయ్యప్పస్వామి ఆలయానికి వెళ్లాడు. స్వామిని దర్శించుకుని బయటకు వచ్చిన తరువాత తన స్కూటీలో ఉంచిన నగదు చోరీ అయినట్లు గమనించి లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు


పట్టుబడిన నిందితులు, చోరీ సొత్తును చూపుతున్న ఎస్ఐ

ధర్మవరంరూరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి వెండి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలను శనివారం ఆయన స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల చిగిచెర్ల గ్రామంలో వీరముద్దప్ప గుడి, గొట్లూరులో మహంకాళమ్మ, పెద్దమ్మ గుడి, రాంపురంలోని సత్యమ్మ ఆలయాల్లో జరిగిన చోరీలపై కేసులు నమోదు చేశామన్నారు. వీటిపై పలు కోణాల్లో విచారణ చేసినట్లు వెల్లడించారు. ఈక్రమంలో అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన గురునాథం అంజయ్య, గురునాథం ఆంజనేయులు, కర్ణాటక రాష్ట్రం పావగడ తాలుకా ఎగువపల్లికి చెందిన గురునాథం వెంకటేశ్వర్లు చోరీలు చేసినట్లు తేలడంతో వారిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 30 వెండి గొడుగులు, (340గ్రాములు) మూడు గ్రాముల బంగారం తాళిబొట్లు రెండు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ముగ్గురు ఊరు చివరన ఉన్న ఆలయాలపై రెక్కీ నిర్వహించి, రాత్రి పూట చోరీలకు పాల్పడేవారని తెలిపారు.

నేత్రదానంతో మరో ఇద్దరికి వెలుగు


నేత్రాలను దానం చేస్తున్న కుటుంబ సభ్యులు

ధర్మవరం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నేత్రదానంతో మరో ఇద్దరికి వెలుగుదారి చూపినట్లు యువర్స్‌ఫౌండేషన్ ప్రెసిడెంట్ పోలాప్రభాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని తొగటవీధికి చెందిన పెద్దకోట్ల రామకృష్ణ(70) శనివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న యువర్స్ ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాసులు, వెంకటనారాయణ మృతుడి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. వారి అంగీకారంతో యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్ కుళ్లాయప్ప, కంటి రెట్రొవైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర నేత్రాలను సేకరించారు. నేత్రాదానికి సహకరించిన మృతుడి భార్య నాగరత్న, కుమారుడు రాజేంద్రకు యువర్స్‌ఫౌండేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయంలో వీరంగం

అమ్మవారి విగ్రహం ముక్కు ధ్వంసం

హుండీ సొమ్ము అపహరణ


అమ్మవారి విగ్రహం ముక్కుని ధ్వంసం చేసిన దుండగులు

నార్పల, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మారెమ్మ గుడిలో శుక్రవారం రాత్రి తాగుబోతులు వీరంగం చేశారు. అమ్మవారి విగ్రహం ముక్కును ధ్వంసం చేసి, ఆలయంలోని హుండీని అపహరించారు. ఆలయ పరిసరాల్లో మద్యం తాగి, బాటిల్, వాటర్ ప్యాకెట్లు అక్కడే వదిలేశారు. అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దుండగులను గుర్తించి, కఠినంగా శిక్షించాలని కోరుతూ నార్పల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఎస్ఐ సాగర్, సీఐ కౌలుట్లయ్య ఆలయాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు. ఆలయంలో వీరంగం చేసిన వారిని గుర్తించి, కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.


ఆలయంలో చెల్లాచెదురుగా విసిరేసిన వస్తువులు

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

నలుగురికి గాయాలు



రోదిస్తున్న పెద్దపుల్లన్న భార్య, కుటుంబ సభ్యులు, పెద్ద పుల్లన్న(ఫైల్)



ప్రజ్వల్‌ను ఒడిలో పెట్టుకుని బోరున విలపిస్తున్న వన్నూరక్క, పొలంలో కారు

గుంతకల్లుటౌన్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో శనివారం వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందగా.. నలుగురు గాయపడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం అలుముకుంది. గుంతకల్లు మండలం తిమ్మాపురం గ్రామం వద్ద కూలీల ఆటో బోల్తా పడి ఒకరు దుర్మరణం చెందగా.. ముగ్గురు గాయపడ్డారు. మండలంలోని దంచర్ల గ్రామానికి చెందిన పెద్దపుల్లన్న (45) ప్రాణాలు కోల్పోయాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దంచర్ల గ్రామానికి చెందిన పదిమంది వ్యవసాయ కూలీలు ఆటోలో దోనిముక్కల గ్రామ సమీపంలోని పొలంలో పనులకు వెళ్లారు. మధ్యాహ్నం పని ముగించుకుని ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. తిమ్మాపురం గ్రామ సమీపంలోకి రాగానే వెనుక వస్తున్న టిప్పర్ డ్రైవర్.. ముందు గొర్రెల మందను పక్కకు తిప్పాడు. టిప్పర్ ఎక్కడ తగులుతుందోనని ఆటోను డ్రైవర్ పక్కకు తిప్పాడు. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో పెద్ద పుల్లన్న అక్కడికక్కడే మృతిచెందగా.. రంగస్వామి, ఎల్లప్ప, రామాంజనేయులు గాయపడ్డారు. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెద్దపుల్లన్నకు భార్య సువర్ణ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ప్రమాదంపై రూరల్ ఎస్ఐ రాఘవేంద్రప్ప కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడి మృతి.. తండ్రి పరిస్థితి విషమం..

కళ్యాణదుర్గం(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోళ్ల గ్రామం వద్ద ద్విచక్రవాహనాన్ని అతివేగంగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో కుమారుడు మృతిచెందగా.. తండ్రి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోళ్ల గ్రామానికి చెందిన వన్నూరుస్వామి... కుమారుడు ప్రజ్వల్ (6)తో కలిసి కళ్యాణదుర్గం పట్టణానికి ద్విచక్రవాహనంలో వెళ్లాడు. పని ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. గోళ్ల సమీపంలో అనంతపురం నుంచి కళ్యాణదుర్గానికి వేగంగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ద్విచక్రవాహనంలో ఉన్న తండ్రి, కుమారుడు ఎగిరి పడిపోయారు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఓ ప్రైవేటు వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యం అందిస్తుండగా ప్రజ్వల్ మృతిచెందాడు. వన్నూరుస్వామి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కారులో బెలూన్లు ఓపెన్ కావడంతో అందులోని వారు క్షేమంగా బయటపడ్డారు. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు రాయల్ వెంకటేశులుకు చెందిన కారుగా పోలీసులు గుర్తించారు. కారు అతివేగమే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని తెలుస్తోంది. ప్రమాద స్థలంలో ప్రజ్వల్‌ను ఒడిలో పెట్టుకుని తల్లి వన్నూరమ్మ బోరున విలపించడం కలచివేసింది. ప్రమాదంపై కళ్యాదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారం కోసం వచ్చి..


గోవిందరాజ్ మృతదేహం

రొళ్ల(ఆంధ్రజ్యోతి): మండలంలోని భాజంపాళ్యం గ్రామ సమీపాన బైక్‌ను ఆటో ఢీకొన్న ప్రమాదంలో చిరు వ్యాపారి గోవిందరాజ్(35)దుర్మరణం చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నా యి. కర్ణాటకలోని కంబదహళ్లి గ్రామానికి చెందిన గోవిందరాజ్ వ్యాపారం నిమిత్తం ద్విచక్రవాహనంలో వెళ్లి వస్తుండగా రత్నగిరి వైపు నుంచి వస్తున్న ఆటో రోడ్డు మలుపు వద్ద ఎదురుగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న గోవిందరాజ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సార్...! జలహారతికి రండి

● సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆహ్వానం


సీఎం చంద్రబాబు వెంట నడుస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అనంతపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలతో మడకశిర నియోజకవర్గంలో పలు చెరువులను నింపుతున్నారు. మడకశిర నియోజకవర్గ చరిత్రలోనే అమరాపురం చెరువును నీటితో నింపిన దాఖలాలు లేవు. హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాలతో అమరాపురం చెరువును నీటితో నింపుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని డిసెంబరులో నిర్వహించే జలహారతికి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆహ్వానించారు. తలుపుల మండలం పెద్దన్నవారిపల్లిలో శనివారం నిర్వహించిన సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఇదే సందర్భంలో జలహారతి కార్యక్రమానికి రావాలని విన్నవించారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

కలెక్టర్ ఆనంద్



అనంతపురం కలెక్టరేట్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజలకు వైద్య సేవలు అందించడంలో వైద్యాధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఆనంద్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఎంహెచ్ఓ ఈబీ దేవితో కలిసి జిల్లాలో జరిగిన మాతాశిశు మరణాలపై సమీక్షించారు. అనంతపురం రూరల్ కురుగుంట-2, యాడికి-1, రాయదుర్గం-1, కొర్రపాడు-1, కొర్రపాడు యూపీహెచ్‌సీలో జరిగిన మాతృ మరణాలపై ఆరాతీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ప్రసవిస్తూ ఏ తల్లీ, జన్మిస్తూ ఏ బిడ్డా చనిపోకూడదన్నారు. కొర్రపాడు పరిధిలోని చదల్ల గ్రామానికి చెందిన రాధమ్మ మాతృ మరణానికి బాధ్యురాలైన ఆశా వర్కర్‌ను విధుల నుంచి తొలగించడంతోపాటు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. యాడికి మండలం వీరన్నపల్లికి చెందిన హరిత అనే మహిళ మరణానికి కారణమైన ఆర్ఎంపీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలనీ, ఆశా, ఏఎన్ఎంపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలనీ, వైద్యాధికారికి మెమో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. కురుగుంటకు చెందిన మృదుల మృతికి కారణమైన వైద్య, ఆరోగ్య సిబ్బందికి మెమోలు జారీ చేయాలన్నారు. సమావేశంలో వైద్యులు జయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, శంషాద్‌బేగం, నారాయణస్వామి, గంగాధర్ పాల్గొన్నారు.

కుష్టును ఆదిలోనే అరికట్టాలి: కలెక్టర్ ఆనంద్

అనంతపురం వైద్యం, కలెక్టరేట్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి, నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ.. ఈనెల 17 నుంచి 30వ తేదీ వరకు 14రోజులపాటు కుష్టు వ్యాధిపై సర్వే చేపడతారన్నారు. జిల్లాలోని ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ జయలక్ష్మి, డీఎన్ఎంఓ డాక్టర్ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలను విస్తరించాలి...

రెడ్ క్రాస్ సేవలను ప్రజలకు మరింత చేరువయ్యేలా విస్తరింపజేయాలని సంస్థ నిర్వాహకులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. ప్రథమ చికిత్స విధానంపై పరిశ్రమల్లోని కార్మికులకు అవగాహన కల్పించాలని సూచించారు. తద్వారా కార్మిక భద్రత మెరుగుపడుతుందన్నారు. రక్తనిధి కేంద్రాల్లో సరిపడా నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్‌పర్సన్ కాపు భారతి, రాష్ట్ర సభ్యుడు కాపు రామచంద్రరెడ్డి, వైస్‌ఛైర్మన్ డాక్టర్ లక్ష్మణప్రసాద్, కార్యదర్శి మోహనకృష్ణ పాల్గొన్నారు.

మురడి ఆలయ పవిత్రతను కాపాడుతా

● కాలవ శ్రీనివాసులు



రాయదుర్గం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మురడి ఆలయ పవిత్రతను కాపాడుతానని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మురడి ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకుడికి న్యాయం చేయాలనే విషయంలో తాను ఇచ్చిన లేఖపై సోషల్ మీడియాలో వివాదం చెలరేగిన నేపథ్యంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అనంతశయన అనే అర్చకుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు డి.హీరేహళ్ పోలీస్‌స్టేషన్‌లో గతంలో కేసు నమోదు అయిందన్నారు. ఆ ఫిర్యాదు ఆధారంగా అప్పట్లో అతన్ని ఆలయ అర్చకత్వం నుంచి సస్పెండ్ చేశారన్నారు. ఆ తరువాత భార్య, భర్తలు రాజీపడి కోర్టులో కేసు కొట్టి వేయించుకున్నా రని వెల్లడించారు. తర్వాత వారి కుమార్తెతో కలిసి తన వద్దకు పలుమార్లు వచ్చి కుటుంబాన్ని ఆదుకోవడానికి సాయం చేయమని కోరారని తెలిపారు. ప్రవర్తన సరిగాలేని వ్యక్తిని తాను సాయం చేయనని చెప్పానన్నారు. తర్వాత ఆ గ్రామ నాయకులు, మండల నాయకులు ఆలయంలో అర్చకత్వం చేసుకునేందుకు లేఖ ఇమ్మని చెప్తే ఐదునెలల కిందట ఇచ్చానన్నారు. ఒక పవిత్రమైన ఆలయంలో అర్చకత్వం చేసే విషయంలో వివాదం ఉన్నప్పుడు లేఖ ఇవ్వకపోయి ఉంటే బాగుండేదన్నారు. లేఖ ఇచ్చినంత మాత్రాన ఆలయంలో అతన్ని అర్చకుడిగా మళ్లీ నియమించలేదన్నారు. దీనిపై కొందరు వివాదం సృష్టించేందుకు ప్రయత్నిస్తుండటం దారుణమన్నారు. అయినా ఇది నైతిక ప్రవర్తనకు సంబంధించిన అంశం కాబట్టి ఓ ప్రజాప్రతినిధిగా వివరణ ఇవ్వాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి తలెత్తకుండా జాగ్రత్త వహిస్తానన్నారు.

నేటి నుంచి సీకే నాయుడు క్రికెట్ టోర్నీ


కెప్టెన్లతో రెఫరీల సమావేశం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సీకే నాయుడు జాతీయ క్రికెట్ టోర్నీని నగరంలోని రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నారు. ఆంధ్రా అండర్-23, పాండిచ్చేరి అండర్-23 జట్ల మధ్య ఈ మ్యాచ్ ఆదివారం నుంచి ఐదో తేదీ వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. గతేడాది జరిగిన దులీప్‌ట్రోఫీ తరహాలోనే ఈ మ్యాచ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆంధ్రా, పాండిచ్చేరి జట్లు అనంతకు చేరాయి. మైదానంలో శనివారం ఉదయం, సాయంత్రం ఇరుజట్ల క్రీడాకారులు బౌలింగ్, ఫీల్డింగ్, బ్యాటింగ్ అంశాల్లో ప్రాక్టీస్ చేశారు. మ్యాచ్ అఫిషియల్స్ రెఫరీ నియతీలోకూర్, అంపైర్లు అభిజిత్ దేశ్‌ముఖ్, కేఆర్ వాసుకి, ఆంధ్రా కెప్టెన్లు హేమంత్‌రెడ్డి, నీయాన్ శ్యామ్ కంగయాన్, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి మైదానంలో పిచ్, ఏర్పాట్లను పరిశీలించారు.

టమోటా కిలో రూ.23

అనంతపురంరూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో శనివారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.10తో, సరసరిగా రూ.16తో విక్రయాలు జరిగాయన్నారు.

ఉత్తరాలు రాయండి

తపాలాశాఖ సూపరింటెండెంట్ అమర్నాథ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తపాలాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే లెటర్ రైటింగ్ పోటీలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తపాలాశాఖ సూపరింటెండెంట్ అమర్నాథ్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా లెటర్ టు మై రోల్‌మోడల్ అనే అంశంపై పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 18 సంవత్సరాలలోపు, ఆ పైబడిన వారికి రెండు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. మొదటి విభాగం ఇన్‌లాండ్ లెటర్ కార్డ్(ఐఎల్‌సీ) కేటగిరిలో 500 పదాలకులోపుగా ఉండాలన్నారు. రెండో విభాగం ఎన్వలప్ కేటగిరిలో 1000 పదాలకు మించకుండా రాయాలన్నారు. చేతితో రాసిన ఉత్తరం మాత్రమే పరిగణలోకి తీసుకుంటామన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ బాషలలో రాసిన ఉత్తరాలను డిసెంబరు 8లోపు అనంతపురంలోని ప్రధాన తపాలా సూపరింటెండెంట్ కార్యాలయానికి పంపాలన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి రూ. 25 వేలు, ద్వితీయ బహుమతి రూ. 10 వేలు, తృతీయ బహుమతి రూ. 5 వేలు, జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ. 25 వేలు, తృతీయ బహుమతి రూ. 10 వేలు అందజేస్తారన్నారు.

ఈఈఎంటీకి దరఖాస్తు చేసుకోండి: డీఈఓ

కొత్తచెరువు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో నిర్వహించనున్న ఈఈఎంటీ- 2026 పరీక్షకు విద్యార్థులు ఈ నెల 14 లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ క్రిష్టప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖ అనుమతితో ఎడ్యుకేషన్ ఏపీ ఫణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో చదువుతున్న 7, 10 తరగతుల విద్యార్థులు పరీక్ష రాయడానికి అర్హులు అన్నారు. ఈ పరీక్ష రెండు దశల్లో ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయిలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన పదో తరగతి విద్యార్థులకు రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు అందిస్తారన్నారు. ఏడో తరగతి విద్యార్థులకు వరుసగా రూ.20వేలు, రూ.15 వేలు, రూ.10వేలు అందిస్తారని డీఈఓ తెలిపారు. జిల్లా స్థాయిలో కూడా నగదు బహుమతులు ఉంటాయన్నారు. వివరాల కోసం జిల్లా సైన్సు అధికారి తనూజ్‌కుమార్ (సెల్ నంబర్:9492843184)ను సంప్రదించాలన్నారు.

12 దాకా ఈ పంట నమోదు

అనంతపురం అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి ఈ పంట నమోదు గడువును ఈనెల 12 దాకా పొడిగించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1901538 ఎకరాలకు (సాగు చేసిన పంట పొలాలు, బీడు పొలాలు)గాను ఇప్పటి దాకా 1740276 ఎకరాల్లో (92శాతం) ఈ పంట నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈనెల 8 దాకా ఈ పంట నమోదులో పెండింగ్‌లోని సర్వే నెంబర్లు అన్ని నమోదు చేయాలన్నారు. 9 నుంచి 12 దాకా సామాజిక తనిఖీలో భాగంగా జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తామన్నారు. సామాజిక తనిఖీలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించి, 13 తుది జాబితాను ప్రదర్శిస్తామన్నారు.

అవినీతే అభివృద్ధికి అడ్డంకి

విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్


మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్

అనంతపురం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అవినీతి.. దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి పెద్ద అడ్డంకి అని విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్ అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా శనివారం పవర్ ఆఫీస్ ఆవరణలో విద్యుత్ శాఖ విజిలెన్స్, ఏపీటీఎస్ పోలీసు స్టేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'నిజాయితీ ప్రమాణం' కార్యక్రమాన్ని చేపట్టారు. ఎస్ఈ శేషాద్రి శేఖర్, ఈఈ జేవీ రమేష్, ఏపీటీఎస్ సీఐ విశ్వనాథ్ చౌదరి, ఏడీఈ రామకృష్ణ హాజరయ్యారు. ఎస్ఈ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ పనులను నిజాయితీగా చేయాలన్నారు. బాధ్యతగా చేయడం ద్వారా అవినీతి నిర్మూలించగలమన్నారు. అనంతరం అధికారులు, సిబ్బంది అవినీతి నిర్మూలనకు కట్టుబడి ఉంటామనీ, ప్రతి పనిలో నిజాయితీ, పారదర్శకత పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది నాగన్న, విద్యుత్ శాఖ డీఈఈలు రఘు, రవిశంకర్, ఎన్టీఓ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ శేక్ రోషన్, విజిలెన్స్ అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చెస్‌లో అంతర్జాతీయ రేటింగ్


సాయి సారిష్

గుంతకల్లుటౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి సాయి సారిష్ చెస్‌లో అంతర్జాతీయ రేటింగ్ సాధించాడు. కర్నూలు పట్టణంలో అక్టోబరులో జరిగిన అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభ చాటాడు. రాపిడ్‌లో రేటింగ్ 1440, బ్లిట్జ్‌లో 1651 అత్యధిక రేటింగ్ సాధించి రికార్డ్ నెలకొల్పాడు. ఇతను దాదాపు రెండు సంవత్సరాలుగా కోచ్ అనిల్‌కుమార్, రామారావు వద్ద శిక్షణ పొందుతున్నట్లు తెలిపాడు.

గడినాడ సమస్యలకు త్వరలో పరిష్కారం

●జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డా.శరణప్రకాశ్ పాటిల్


రాజ్యోత్సవ పురస్కార గ్రహీతలతో మంత్రి పాటిల్

రాయచూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గడినాడ ప్రాంతంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం త్వరలోనే పరిష్కారం ఇస్తుందని రాష్ట్ర వైద్యవిద్య,ఆరోగ్య శాఖ,రాయచూరు జిల్లా ఇంచార్జ్ మంత్రి డా.శరణప్రకాశ్ పాటిల్ అన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రిగా శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాజోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మంత్రి విలేఖరులతో మాట్లాడారు. గడినాడ హొరనాడు పేరుతో ఇప్పటికే రిజర్వేషన్‌లు అమలులో ఉన్న నేపథ్యంలో ఈ రెండింటి వల్ల ఎదురవుతున్న ఇబ్బందులు వాస్తవంగా విద్యార్థులు పడుతున్న ఇబ్బందుల పై త్వరలో జిల్లాధికారి ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిపుణులతో చర్చించి తగిన పరిష్కారం చూపుతుందన్నారు. అతివృష్టి వల్ల ఎదురైన పంటనష్టానికి సంబంధించి త్వరలోనే పరిహారం అందజేస్తామని మంత్రి తెలిపారు. ఇప్పటికే ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఏరియల్ సర్వే ద్వార పంటనష్టం గురించి ప్రత్యేక్షంగా పరిశీలించారని అధికారుల నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా ఎకరాకు రూ.17 వేలు పరిహారం త్వరలోనే అందజేయనున్నట్లు తెలిపారు.


హెచ్ఎం, టీచర్ గొడపై విచారణ

అనంతపురం విద్య, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఓ మహిళా టీచర్ గొడవపై విద్యాశాఖ ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకు న్నారు. వీరిద్దరు నిత్యం వివిధ కారణాలతో గొడవ పడుతున్నారు. ఒకరిపై ఒకరు రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ మేరకు కమిషనర్ కార్యాలయం నుంచి డీఈఓకు ఫోన్ చేసి ఆరాతీసినట్లు సమాచారం, వజ్రకరూరులో అంత జరుగుతుంటే ఏమి చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని సీరియస్ గా ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో డీఈఓ ప్రసాద్‌బాబు వెంటనే విచారణ చేసి నివేదిక ఇవ్వాలని డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఈనేపథ్యంలో వజ్రకరూరు గొడవ వ్యవహారం విద్యాశాఖవర్గాలలో చర్చకు దారితీసింది.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

పానుగంటి లక్ష్మీనరసింహారావు (జయంతి)



ప్రముఖ తెలుగు సాహితీవేత్త పానుగంటి లక్ష్మీనరసింహారావు 1865 నవంబరు 2న రాజమండ్రి తాలూకా సీతానగరంలో జన్మించారు. కవి శేఖరుడు, అభినవ కాళిదాసు, ఆంధ్ర అడిసన్, ఆంధ్ర షేక్‌స్పియర్ అనే బిరుదులు పొందారు. చదివినకొద్దీ మరింతగా చదివేందుకు ఉత్సాహం కలిగించేలా ఆయన రచనలు ఉంటాయి. సారంగధర చరిత్ర, విజయరాఘవము, కోకిల, విప్రనారాయణ చరిత్ర వంటివి పేరొందాయి. పలు సంస్థానాలలో దివానుగా వ్యవహరించారు. 1940 అక్టోబరు 7న కన్నుమూశారు.

అరుణ్ శౌరి (పుట్టినరోజు)



'పద్మభూషణ్' పురస్కార గ్రహీత అరుణ్‌శౌరి 1941 నవంబరు 2న పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో జన్మించారు. ఆర్థికవేత్తగానే కాకుండా పాత్రికేయుడిగా, రచయితగా రాణించారు. వరల్డ్‌బ్యాంకులో ఆర్థికవేత్తగాను, ప్లానింగ్ కమిషన్ ఆఫ్ ఇండియాకు కన్సల్టెంట్‌గా వ్యవహరించారు. రాజ్యసభ సభ్యుడిగా కేంద్రంలో వివిధ మంత్రిత్వ శాఖలు నిర్వహించారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ది టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రికలకు ఎడిటర్‌గా వ్యవహరించారు. బయోసైన్సెస్, బయో ఇంజనీరింగ్‌లో సేవలకు రామన్ మెగసెసె అవార్డు పొందారు.

షారుఖ్‌ఖాన్ (పుట్టినరోజు)



సినీ రంగంలో 'బాద్ షా ఆఫ్ బాలీవుడ్'గాను 'కింగ్ ఖాన్' పేరొందిన షారుఖ్‌ఖాన్ 1965 నవంబరు 2న న్యూఢిల్లీలో జన్మించారు. ప్రపంచవ్యాప్తంగా ఆయనకు అభిమానులు ఉన్నారు. నటుడిగానే కాక నిర్మాతగా, బుల్లితెర పర్సనాలిటీగా పేరొందారు. 80కుపైగా సినిమాలలో నటించగా దాదాపు బాక్సాఫీస్ హిట్ అందుకున్నాయి. 'పద్మశ్రీ' సహా ఎన్నో పురస్కారాలతోపాటు 5 గౌరవ డాక్టరేట్‌లు, 14 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు ఇతర గౌరవాలు పొందారు. మోషన్ పిక్చర్ ప్రొడక్షన్ కంపెనీకి కో-ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఐపీఎల్ క్రికెట్‌లో కోల్కత్తా నైట్ రైడర్స్, కరీబియన్ ప్రీమియర్‌లీగ్ జట్లకు సహభాగస్వామ్యం కలిగారు. 2023లో 'టైమ్' మ్యాగజైన్ జాబితాలో అత్యంత ప్రభావశీలుర వ్యక్తిలో ఒకరిగా నిలిచారు. కొవిడ్ వేళ సామాజికసేవలతో ప్రజల అభిమానం పెరిగింది.

యోగేశ్వర్‌దత్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత యోగేశ్వర్ దత్ 1982 నవంబరు 2న హర్యానా రాష్ట్రం సోనిపట్ జిల్లా భైన్స్‌వాల్ కాలన్ గ్రామంలో జన్మించారు. ఫ్రీస్టైల్ రెజ్లర్. 8వ యేట నుంచే రెజ్లింగ్‌లో ప్రతిభ కనబరిచి స్వగ్రామంలో బాలరాజ్ పహిల్వాన్‌గా గుర్తింపు పొందారు. ఏషియన్ గేమ్స్‌లో పాల్గొని రజత పురస్కారాలు పొందారు. 2012 సమ్మర్ ఒలింపిక్స్‌లో కాంస్యపతకం, 2014 కామన్వెల్త్ గేమ్స్‌లో బంగారు పతకం అందుకున్నారు. 'రాజీవ్ గాంధీ ఖేల్ రత్న'తోపాటు పలు అవార్డులు పొందారు. హర్యానా హ్యామర్స్‌లో ఐకాన్ కేటగిరీలో చోటు సాధించారు. 2019లో బీజేపీలో చేరారు.

కారు నుంచి కిందకు దించి.. దళిత అధికారికి అవమానం

» నిరసన తెలిపినందుకు డిమోషన్



ఇన్‌చార్జ్ తహసీల్దార్ స్వామి

బెంగళూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కులగణన సర్వేకు హాసన్ జిల్లా సకలేశపుర సబ్‌డివిజనల్ అధికారి రాజేశ్, అరకలగూడు తహసీల్దార్ స్వామిలు పర్యవేక్షణకు వివిధ ప్రాంతాలకు వెళ్లారు. తహసీల్దార్, సబ్‌డివిజనల్ అధికారులు ఒకే కారులో ప్రయాణించారు. తహసీల్దార్ కూర్చునే ముందు సీటులో గ్రేడ్-2 తహసీల్దార్ స్వామి కూర్చోవడాన్ని సబ్‌డివిజనల్ అధికారి జీర్ణించుకోలేకపోయారు. మార్గమధ్యంలో వాహనాన్ని ఆపి తహసీల్దార్ సీటులో కూర్చునేందుకు నీవు ఎవరంటూ ప్రశ్నించారు. గ్రేడ్-2 తహసీల్దార్ స్వామిని దూషించి మధ్యలోనే వదిలిపెట్టి వెళ్లిపోయారు. మానసికంగా కుంగిపోయిన గ్రేడ్-2 తహసీల్దార్ స్వామి అరకలగూడు కార్యాలయం ఎదుట అంబేడ్కర్ ఫోటోను పట్టుకుని మూడు రోజులపాటు నిరంతరంగా నిరసన తెలిపారు. కొన్ని దళితసంఘాలు మద్దతు ఇచ్చాయి. హాసన్ జిల్లా అధికారి లతా కుమారి, సీనియర్ అధికారులు చెప్పినట్టు వినాల్సిందేనని అది క్రమశిక్షణలో భాగమని అభిప్రాయపడ్డారు. అరకలగూడు గ్రేడ్-2 తహసీల్దార్‌గా కొనసాగుతున్న స్వామికి ఇన్‌చార్జ్ బాధ్యతలు రద్దు చేశారు. శిరస్తేదార్‌గానే కొనసాగాలని సూచించారు. అటు అధికారి కారులోనుంచి అవమానించడం, జిల్లా అధికారి ఏకంగా రివర్షన్ ఇవ్వడంతో స్వచ్ఛందంగా ఉద్యోగాన్ని వదులుకోవాలని నిర్ణయించినట్టు స్వామి శనివారం మీడియాకు తెలిపారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

రొద్దం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నమంతూరు గ్రామం లో హిందూపురం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు బస్టాండులో ఆగిపోయింది. శనివారం సాయంత్రం 4-30 సమయంలో హిందూపురం నుంచి రొద్దంకు వచ్చి తిరుగుప్రయాణంలో అవుతూ బస్టాండులో ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాలం చెల్లిన బస్సులతో ఇదే తంటా అంటూ మండిపడ్డారు.



ఆగిపోయిన ఆర్టీసీ బస్సు



ముళబాగిలు వేడుకలో ఎమ్మెల్యే తదితరులు



కేఎస్ఆర్టీసీ కార్యాలయంలో..



శిడ్లఘట్ట నగరసభ కార్యాలయంలో...

కన్నడ సాహిత్యాన్ని ప్రోత్సహించండి

» కేంద్రమంత్రి కుమారస్వామి

» వాడవాడలా కన్నడ రాజ్యోత్సవం

బెంగళూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కన్నడ భాష సాహిత్యాన్ని ప్రోత్సహించాలని కేంద్రమంత్రి కుమారస్వామి అభిప్రాయపడ్డారు. కన్నడ రాజ్యోత్సవాన్ని పురస్కరించుకుని సప్నబుక్‌హౌస్‌లో శనివారం ఏర్పాటైన పుస్తకజాతరలో పలు పుస్తకాలను ఆవిష్కరించారు. రాజ్యసభ సభ్యురాలు, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ముఖ్యులు సుధామూర్తి ముఖ్యులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయితీ పుస్తకాల మేళాను ప్రారంభించి మాట్లాడుతూ పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు.

నగరసభలో కన్నడ రాజ్యోత్సవం

శిడ్లఘట్ట: శిడ్లఘట్ట నగరసభ కార్యాలయంలో శనివారం కన్నడ రాజ్యోత్సవం సరళంగా ఆచరించారు. కన్నడ మాత చిత్రపటానికి పుష్పాలు సమర్పించి కన్నడ పతాకాన్ని నగరసభ అధ్యక్షుడు ఎం వెంకటస్వామి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగరసభ కమిషనర్ అమృత, నగరసభ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు అప్సర్‌పాషా, సభ్యులు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

రాయపురంలో...



సర్జాపుర గ్రామపంచాయతీ కార్యాలయంలో..



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి కుమారస్వామి

విజయనగర్: చామరాజపేట నియోజకవర్గం జగ్జీవన్ రామనగర్ ఐపీడీ సాలప్ప కాలనీ రాయపురంలో కన్నడ రాజ్యోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాయపురం వార్డు కాంగ్రెస్ నాయకుడు సీఆర్ రవిప్రసాద్ ముఖ్యులుగా పాల్గొని కన్నడ పతాకాన్ని ఎగురవేశారు. కన్నడ మాతకు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో స్థానికులు, కన్నడ అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మహదేవపురలో..

మహదేవపుర: కన్నడ సాంస్కృతిక, భౌగోళిక పరంపరను స్మరించుకునే రోజుగా కన్నడ రాజ్యోత్సవానికి ఉందని ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి పేర్కొన్నారు. మారతహళ్ళి అశ్వత్థనగర్, పట్టందూరు అగ్రహార, సూలికుంటె గ్రామాలలో ఏర్పాటైన రాజ్యోత్సవ కార్యక్రమాలలో కన్నడ పతాకాన్ని ఎగురవేసి కన్నడ మాత భువనేశ్వరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బెంగళూరు నగరం వివిధ రాష్ట్రాల ప్రజలతో బహుసాంస్కృతిక కేంద్రంగా మారింద న్నారు. కన్నడభాష తెలియనివారికి అభిమానంతో భాషను నేర్పించాల్సిన బాధ్యత ప్రతి కన్నడిగుడిపై ఉందన్నారు. కార్యక్రమంలో మంజునాథ్, నాగేశ్, లోకేశ్, తదితరులు పాల్గొన్నారు.

సర్జాపుర గ్రామంలో

దొమ్మసంద్ర: ఆనేకల్ తాలూకా సర్జాపుర బాలికల ప్రాథమిక పాఠశాల ఆవరణలో కన్నడ రాజ్యోత్సవం సంబరంగా సాగింది. సర్జాపుర అధ్యక్షులు వీణా, ఉపాధ్యక్షులు మంజునాథ్ సర్జా నేతృత్వంలో కార్యక్రమం సాగింది. మంజునాథ్ సర్జా మాట్లాడుతూ ఆనేకల్ తాలూకా ఇటీవలికాలంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఉంటున్నారని వారికి స్థానికులు కన్నడ భాష నేర్పించాలన్నారు. అలాగే ఇతర రాష్ట్రాలవారు కన్నడను గౌరవించి నేర్చుకోవాలని అభిప్రాయపడ్డారు. మాతృ భాషను ఆదరిస్తూనే ఇతర భాషలను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్, మాజీ ఉపాధ్యక్షురాలు కళావతి, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహళ్ళిలో...

బొమ్మనహళ్ళి: కన్నడభాషను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని మాజీ కార్పొరేటర్ మంజునాథ్ అభిప్రాయపడ్డారు. సుద్ద గుంటపాళ్య ఉద్యానవనంలో రాజ్యో త్సవ వేడుకలలో పాల్గొని మాట్లా డుతూ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ కన్నడభాష నేర్చుకోవాలన్నారు. జీవనోపాధికోసం ఇతర రాష్ట్రాలనుంచి వచ్చినవారు తప్పనిసరిగా కన్నడ నేర్చుకోవాలన్నారు. కొన్ని పాఠశాలల్లో కన్నడ నేర్పించలేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. కన్నడ భాష మనుగడ కోసం ఎన్నో సంఘాలు పోరాటాలు చేస్తున్నాయన్నారు. దుకాణాలు, కార్యా లయాల వద్ద నామఫలకాల ఏర్పాటులో కన్నడకు సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కవిత శ్రీనివాస్ మాట్లాడుతూ కొన్నిసంస్థలు కన్నడభాషను ఉచితంగా నేర్పిస్తున్నాయని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్కును స్థానిక ఎమ్మెల్యే రామలింగారెడ్డి ఎంతో అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆసిఫ్ షరీఫ్, పార్కు అధ్యక్షుడు సిద్దిక్, ఎస్ టీడీ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

విజయపురలో...

విజయపుర: కన్నడ భాష సంస్కృతి మనుగడకోసం ప్రభుత్వం చేసే ప్రయత్నాలకు ప్రజలు అందరూ సహకరించాల్సి ఉందని పురసభ అధ్యక్షురాలు భవ్యమహేశ్ అభిప్రాయపడ్డారు. దేవనహళ్ళి తాలూకా విజయపుర పురసభ కార్యాలయంలో కన్నడమాత భువనేశ్వరిదేవికి పుష్పాంజలి ఘటించారు. మనం ఎంత శ్రీమంతులైనా పిల్లలకు కన్నడ భాష తప్పనిసరిగా నేర్పించాలన్నారు. పురసభ ముఖ్యాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముళబాగిలులో...

ముళబాగిలు: ప్రతిఒక్కరూ కన్నడభాషలో మాట్లాడుతూ కన్నడలో వ్యవహరించడం ద్వారా కన్నడ అభిమానం చూపాలని ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ పేర్కొన్నారు. పట్టణ శివారులోనూ, డీవీజీ సర్కిల్‌లోనూ కసాప, కన్నడ సంఘాల ఆధ్వర్యంలో కన్నడ రాజ్యోత్సవ కార్యక్రమం సంబరంగా సాగింది. తాలూకా పంచాయతీ ఈఓ రవిచంద్ర, డీసీసీ బ్యాంకు డైరెక్టర్ రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాయపురంలో..



మారతహళ్ళి వేడుకలో ఎమ్మెల్యే మంజుళా లింబావళి



ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో...



అజీంప్రేమ్‌జీ యూనివర్సిటీలో...



సుద్దగుంటపాళ్యలో...



విజయపుర పురసభ కార్యాలయంలో....



బాగేపల్లిలో కన్నడ రాజ్యోత్సవంలో సందడి

కన్నడ గెళెయర బళగ ఆధ్వర్యంలో...



లాల్‌బాగ్ గేట్ వద్ద కువెంపు విగ్రహం వద్ద కన్నడ గెళెయర బళగ సభ్యులు

బెంగళూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కన్నడ గెళియర బళగ సంస్థ ద్వారా కన్నడ రాజ్యోత్సవ వేడుకలు జరిపారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రా నం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం సౌత్‌ఎండ్ సర్కిల్‌లోని తీనం శ్రీకంఠయ్య విగ్రహం, లాల్‌బాగ్ ఉత్తర ద్వారంలోని జాతీయ కవి కువెంపు విగ్రహానికి పూలమాల వేశారు. ప్రముఖులు హెచ్ నరసింహయ్య, బీఎం శ్రీకంఠయ్యల విగ్రహాలకు పూలు చల్లారు. ఇదే సందర్భంగా రానం చంద్రశేఖర్ మాట్లాడుతూ జాతీయ కవి కువెంపుకు ఎన్నో పదవుల అవకాశం వచ్చినా జీవితకాలం కన్నడ సేవలోనే కొనసాగారన్నారు. కన్నడ ఏకీకరణతో పాటు భాషా సంస్కృతి కోసం పాటుపడిన వారిని స్మరించుకోవాలన్నారు. భావి తరాలకు కన్నడ ప్రాధాన్యత తెలిసేలాంటి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కన్నడ అభిమానులు మా చంద్రశేఖర్, బాహ ఉపేంద్ర, కార్మికలోక పత్రిక రవికుమార్, వాచ చన్నేగౌడ, కన్నడ అధ్యాపకులు డాక్టర్ రుద్రేష్ అదరంగి, గిరీష్ అనేకెరెతో పాటు పలువురు భాగస్వామ్యులయ్యారు.

బీడీఏ ద్వారా కాలనీలో కన్నడ భవనాలు

» బీడీఏ చైర్మన్ ఎన్ఏ హ్యారిస్

బెంగళూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీడీఏ ఆధ్వర్యంలోలే అవుట్‌లు, కాలనీలలో కన్నడ భవనాలు నిర్మిస్తామని బీడీఏ చైర్మన్ ఎన్ఏ హ్యారిస్ అభిప్రాయపడ్డారు. జయకర్ణాటక జనపరవేదిక ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డు బ్యాట్రన్ సెంటర్‌లో రాజ్యోత్స వేడుకలు జరిపారు. జనపర వేదిక ఐదో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యులుగా పాల్గొన్న హ్యారిస్ మాట్లాడుతూ బెంగళూరులో అన్ని ప్రాంతాలలోనూ కన్నడభవనాలు నిర్మించే ఆలోచన ఉందన్నారు. బెంగళూరులో విద్య, ఉద్యోగాలకోసం ఇతర రాష్ట్రాలనుంచి వచ్చినవారు లక్షలాదిమంది ఉన్నారని వారు కన్నడ నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. నగరం కన్నడమయం చేయాలని సూచించారు. జయకర్ణాటక జనపరవేదిక గౌరవాధ్యక్షులు గుణరంజన్‌శెట్టి, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, కన్నడ పోరాటనేత రూపేశ్ రాజణ్ణ తదితరులు పాల్గొన్నారు.



జయకర్ణాటక జనపరవేదిక ఆధ్వర్యంలో వేడుకలు

భాషా వైభవం విస్తృతం చేయాలి

» హంపా నాగరాజయ్య

బెంగళూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కన్నడ భాషకు వేల ఏళ్ల చరిత్ర ఉందని ఆధునిక కాలంలోనూ అన్నింటా భాషావైభవాన్ని విస్తృతం చేయాలని సాహితీవేత్త డాక్టర్ హంపా నాగరాజయ్య అభిప్రాయపడ్డారు. నేషనల్ కళాశాలలో రాజ్యోత్సవ వేడుకలలో పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ హెచ్ఎన్ సుబ్రమణ్య, గౌరవ కార్యదర్శి వెంకటశివారెడ్డి, కోశాధికారి తల్లం ద్వారకనాథ్ తదితరులు పాల్గొన్నారు. నాగరాజయ్య మాట్లాడుతూ భాషా పరంపరకు సాంకేతికత అనుసంధానం కావాలని అభిప్రాయపడ్డారు. కన్నడ పతాకం ఆవిష్కరణతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు.



హంపా నాగరాజయ్యను సత్కరిస్తున్న ప్రముఖులు

కళలు, సంస్కృతి సంపద.. అపారం..



కళాశాలలో సాహితీవేత్తకు సన్మానం

బెంగళూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కళలు, సంస్కృతి విభాగాలలో కన్నడ భాషకు అపారమైన సంపద ఉందని సౌందర్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వాసు అభిప్రాయపడ్డారు. సంపద అంటే కేవలం ఆర్థికం, ఆస్తులు కావని సంస్కృతి సంప్రదాయం కూడా ముఖ్యమే అన్నారు. రాజ్యోత్సవ వేడుకలను శనివారం సంబరంగా నిర్వహించారు. ర్యాప్ గాయకుడు ఎంసీ మహేశ్ పాటలు అలరించాయి. ప్రముఖ పాత్రికేయుడు రఘునాథ్ చహ ముఖ్యులుగా పాల్గొన్నారు.

బీబీఎంపీ కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న స్టార్ గురుదేవ్

బొమ్మనహళ్ళి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కన్నడ రాజ్యోత్సవం నేపథ్యంలో జేపీనగర్ పుట్టేనహళ్ళిలో స్థానిక కాంగ్రెస్ నాయకుడు స్టార్ గురుదేవ్ ఆధ్వర్యంలో బీబీఎంపీ పౌరకార్మికులకు చీరలు పంపిణీ చేశారు. మహిళలకు చీరలు, పురుషులకు ప్యాంటు షర్టు అందచేశారు. ఇదే సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. బొమ్మనహళ్ళి బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూధన్, అశ్వత్థనారాయణ, శ్రీనివాసులు, అలిఖాన్, సునిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఏపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు'

పావగడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ గ్రామాన్ని వాసవీ పెనుగొండగా మార్చినందుకు కర్ణాటక రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ యూత్ ఎంపవర్మెంట్ డైరెక్టర్ ఈ సేతురాం కృతజ్ఞతలు తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి సవితకు సంఘం తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1628.06	1632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	12,771	11,860
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	12,361	11,620
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.77

రెండో పంటకు నీరివ్వండి

● మంత్రి పాటిల్‌కు నేతల వినతి

రాయచూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం పరీవాహక ప్రాంతాల్లో సాగు చేస్తున్న నాల్గు జిల్లాల రైతులకు రెండవ పంటకు నీరివ్వాలని ప్రతినిధుల బృందం నాయకులు కోరారు. జిల్లా పర్యటకు వచ్చిన ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పాటిల్‌ను శనివారం నగరంలో కలిసి ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, గంజ్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు రైతు సంఘాల నాయకులు, వ్యాపారులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, ఈ ఏడాది తుంగభద్ర జలాశయం నుంచి నీటిని ముందుగానే విడుదల చేయడం వల్ల నవంబరు చివరి నాటికి ఖరీఫ్ సీజన్ పంట చేతికొచ్చే పరిస్థితి ఉందన్నారు. నీటి విడుదల వల్ల ఇప్పటికు రెండవ పంట వరినాట్లకు రైతులు సిద్ధమవుతున్న నేపథ్యంలో మార్చి చివరి వరకు రెండవ పంట సహితం చేతికొచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం 33 క్రెస్ట్‌గేటలను పునర్ నిర్మించేందుకు నిర్ణయించిన నేపథ్యంలో రెండవ పంటకు నీరిచ్చే విషయంలో ఎలాంటి ఇబ్బంది తలెత్తదని నీటి పారుదల రంగ నిపుణుడు కన్నయ్య నాయుడు తమకు చెప్పినట్లు మంత్రికి వివరించారు. గేట్లు అమర్చేందుకు పనులు చేపట్టడం వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా రెండవ పంటకు నీరివ్వవచ్చని వారు సూచించారు.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



సిరుగుప్ప, నవంబరు 1: పట్టణంలని పేటే ఆంజనేయస్వామికి కార్తీక రెండో శనివారం పూజలు ఘనంగా నిర్వహించారు. దేశనూరు రోడ్డు మార్గంలో వెలసిన పురాతన ఆలయం పేటే ఆంజనేయస్వామి దర్శనానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. ప్రధాన అర్చకులు శ్యామాచార్య స్వామివారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పాలంకరణ చేపట్టారు.

మాతృభాషను రక్షించుకోవడం అందరి బాధ్యత

● రాజ్యోత్సవంలో మంత్రి రహీంఖాన్ ● అన్నిమతాలు, భాషలను ఆదరించడం కన్నడిగుల గొప్పతనమని ప్రశంసలు



రాజ్యోత్సవ వేదికపై మాట్లాడుతున్న మంత్రి రహీంఖాన్



కన్నడ జ్యోతిని వెలిగిస్తున్న మంత్రి, ఎస్పీ, నాయకులు

బళ్లారి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మాతృభాషను సంరక్షించుకోవడం అందరి బాధ్యత అని, ఇందుకు అందరూ కృషి చేయాలని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, హజ్ శాఖ మంత్రి రహీఖాన్ అన్నారు. చైనా, జపాన్ దేశాలు వారి మాతృభాషలో మాట్లాడుతూ అభివృద్ధి చెందాయని, కానీ కన్నడ మాట్లాడేందుకు కొందరు నామోషీ చూపడం సరికాదన్నారు. కర్నాటక 70వ రాజ్యోత్సవాన్ని బళ్లారి మున్సిపల్ మైదానంలో శనివారం అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా కన్నడ మాత భువనేశ్వరికి పటానికి పూలమాల వేశారు. తరువాత కన్నడ జ్యోతిని వెలిగించి కన్నడ పతాకం ఎగరవేశారు. మంత్రి రహీం ఖాన్ ప్రసంగిస్తూ కన్నడభాష పై ప్రతి ఒక్కరూ అంకిత భావంతో ఉండాలని, కన్నడ భాషకు 2,500 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. పూర్వీకులు విశ్వగురువు బసవన్న, ఇతర ఎంతో మంది కవులు కన్నడలోనే రచించిన ఆనవాళ్లు ఉన్నాయన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కర్ణాటకలో సర్వమత, సర్వభాషలు కలిగిన వారు ఉన్నారన్నారు. బళ్లారి జిల్లా వైవిధ్యభరితమైన జిల్లా అని అన్నారు. ఇక్కడ కన్నడ, తెలుగు, ఉర్దూ, భాషలు ఉన్నాయన్నారు. అందువల్ల ఇక్కడ మిశ్రమ సంస్కృతి ఉందన్నారు. రాష్ట్రంలో కన్నడ భాష అభివృద్ధికి సీఎం సిద్దరామయ్య అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు.

పలువురికి సత్కారం

కన్నడ భాషలో వివిధ రంగాల్లో విజయం సాధించిన వారికి జిల్లా స్థాయి అధికారులు 70వ కన్నడ రాజ్యోత్సవంలో ఘనంగా సత్కరించారు. బుర్రకథ- జంబక్క ఎండీ క్యాంపు, కంప్లి, బయలాట- చెన్నదాసర మారెప్ప, మెత్రి, జర్నలిజం ఈనమ్మ కన్నడ నాడు దినపత్రిక వ్యవస్థాపకులు, సంపాదకులు కే.ఎస్. గంగాధర గౌడ, చిత్రలేఖనం- మహమూద్ రఫీ, సాహిత్యం, దమ్మూరు మల్లికార్జున(సిరుగుప్ప) కన్నడ సేవ- హేంత్ రాజ్ సంగనక్కు, విద్యారంగం, సీఎం శిగ్గవి, పురుషోత్తమ, బి. బళ్లారి, వైద్య రంగం- డాక్టర్ మధుర్‌శన్. బంగిదొడ్డా మంజునాథ్, ఇలా అనేక మందికి పురస్కారాలు అందజేశారు.

రాఘవ కళామందిరంలో

రాఘవ కళామందిరంలో శనివారం కర్ణాటక రాజ్యోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. కన్నడ మాత భువనేశ్వరి చిత్రపటానికి పూజలు నిర్వహించి



రాఘవ కళామందిరంలో..

కన్నడ పతాకాన్ని ఎగరవేశారు. కార్యక్రమంలో రాఘవ కళామందిరం గౌరవ అధ్యక్షుడు చన్నప్ప. ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, బాణపుర రమేష్ గౌడ, విరుపాక్ష గౌడ, రామాంజినేయులు, చంద్రశేఖర్, బి.ఎం. బసవరాజు, జీఆర్ వెంకటేశులు, శ్రీనివాసులు, భాస్కర్ నాయుడు, రమణప్ప భజంత్రి, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో..

బళ్లారి గాంధీనగర్ (ఆంధ్రజ్యోతి): కన్నడ రాజ్యోత్సవం పురస్కరించుకుని నగరంలోని పలు ప్రాంతాల్లో వేడుకలు ఆచరించారు. కార్యక్రమంలో భాగంగా నగరంలోని రూపనగుడి రోడ్డులో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు, స్థానిక ప్రముఖులు విద్యార్థులతో ఘనంగా కన్నడ రాజ్యోత్సవం వేడుకలు ఆచరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల స్థలదాత రాజశేఖర్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. శ్రీ వివేకానంద యువ సంఘం ఆధ్వర్యంలో 70వ కన్నడ రాజ్యోత్సవం వేడుకలు ఆచరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పి.గాదెప్ప, రాష్ట్ర మంత్రి రహీంఖాన్, మేయర్ ముల్లంగి నందీష్, అధ్యక్షులు ముండరిగి నాగరాజు, అల్లమ ప్రశాంత్ ఉమన్ కాన్, చిదానందప్ప, మహిళా అధ్యక్షులు మంజుళ తదితర ప్రముఖులతో పాటు వివేకానంద సంఘం సభ్యులు పాల్గొన్నారు. అనతరం కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు.



ప్రభుత్వ పాఠశాలలో..



శ్రీ వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో

ప్రాథమిక పాఠశాలకు హైటెక్ హంగులు

● ప్రైవేట్ స్కూళ్లను తలదన్నేలా అధునాతన సౌకర్యాలు ● ఎమ్మెల్యే రఘురామమూర్తి చొరవతో పూర్తయిన నిర్మాణం

బళ్లారి గాంధీనగర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దూరం నుంచి చూస్తే ఏదో...అధునాతన భవనం... ప్రభుత్వ పాలనా భవనం అనిపిస్తోంది. తీరా దగ్గరకు వెళ్లి చూస్తే ప్రభుత్వ పాఠశాలగా పేరు కనిపిస్తుండడంతో అందరూ ఆశ్చర్య పోతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు కూడా ఇలా ఉంటాయా అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు ఇతర ప్రాంతాల నుండి గ్రామానికి వచ్చిన ప్రజలు. అవును నిజమే.. తనకు విద్యాబోధనలు అందించిన పాఠశాలలో ఎవరూ విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశ్యంతో చెళ్ళకెర నియోజకవర్గం ఎమ్మెల్యే రఘుమూర్తి చొరవతో డీఎంఎఫ్, ఎమ్మెల్యే నిధులు రూ 2కోట్ల రూపాయలు వెచ్చించి ఆధునిక రీతిలో ప్రాథమిక పాఠశాలను నిర్మించిన ఎమ్మెల్యే రఘుమూర్తి అందరికి ఆదర్శంగా నిలిచారు. చెళ్ళకెర నియోజకవర్గం పరిధిలోకి వచ్చే తురువనూరు ఫర్కి పరిధిలోని కడబనకట్టె గ్రామంలో వంద సంవత్సరాల క్రితం నిర్మించిన పాఠశాల స్థానంలో హైటెక్ పాఠశాలను నిర్మించి అందరి చేత మన్ననలు పొందుతున్నారు స్థానిక ఎమ్మెల్యే. 1 నుంచి 7వ తరగతి వరకు వరకు ఉన్న ఈ పాఠశాలలో 137మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ హైటెక్ పాఠశాలలో రెండు అంతస్తులలో ఎనిమిది తరగతి గదులు, నిర్మించగా, వాటిలో ఒకటి గ్రంథాలయం, విజ్ఞాన ప్రయోగాలయం నిర్మించారు. ప్రతి గదిలో గ్రానైట్ ఫ్లోర్‌తో నిర్మాణం కాగా, విద్యుత్ సౌకర్యంతో పాటు విద్యార్థులు నేర్చుకోవడానికి అవసరమైన విజ్ఞాన పరికరాలు, ఐదు కంప్యూటర్లు, ల్యాప్‌టాప్, ప్రతి తరగతి గదికి స్మార్ట్ క్లాస్ ఏర్పాటుతో పీయూ కళాశాలను తలపిస్తోంది. సొంతూరులో హైటెక్ పాఠశాల నిర్మించడం విద్యపట్ల ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు. అన్ని పనులు పూర్తి చేసుకుని త్వరలో హైటెక్ పాఠశాల ప్రారంభానికి ముస్తాబవుతోంది.



ప్రారంభోత్సవానికి సిద్ధమైన పాఠశాల

రాజ్యోత్సవంలో అపశ్రుతి

● పరేడ్ జీప్ నుంచి డీజిల్ లీక్
● సిబ్బంది అప్రమత్తం... తప్పిన ప్రమాదం



డీజిల్ లీక్ అయిన ప్రాంతంలో స్ప్రే చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బళ్లారి గాంధీనగర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బెళగామ్ జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన కన్నడ రాజ్యోత్సవం కార్యక్రమంలో అపశృతి చోటు చేసుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర మంత్రి సతీష్ జార్కిహోళి భువనేశ్వరి మాతకు పూజలు నిర్వహించిన అనంతరం పరేడ్ వీక్షించేందుకు ఏర్పాటు చేసిన పోలీసు జీపును మంత్రి ఎక్కుతున్న సందర్భంలో జీపు డీజిల్ ట్యాంక్ నుండి పెద్దమొత్తంలో డీజిల్ లీక్ కావడం కలకలం రేపింది. వెంటనే గమనించిన అక్కడి అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఫైర్ కంట్రోల్ గ్యాస్‌ను స్ప్రే చేయడంతో ప్రమాదం తప్పింది.

వాడవాడలా కన్నడ సంబరాలు



ఊరేగింపులో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు



అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో..

కంప్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కన్నడ రాజ్యోత్సవాన్ని తాలూకాలు, పల్లెల్లోనూ ఘనంగా జరుపుకున్నారు. కంప్లి పట్టణంలో శనివారం కర్ణాటక రాజ్యోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. తాలుకా అధికారులు భువనేశ్వర్ ఊరేగింపు చేపట్టారు. బళ్లారిలో వేడుకల్లో కంప్లి కళాకారుడు బంగి దొడ్డ మంజునాథను మంత్రి సత్కరించారు.

పీడీహళ్లిలో..

బళ్లారిరూరల్, (ఆంధ్రజ్యోతి): కన్నడ రాజ్యోత్సవాన్ని పరమదేవనహళ్లి గ్రామంలో జటంగి రామేశ్వర పాఠశాల ఆవరణంలో కరెస్పాండెంట్ చంద్రమూర్తి నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ మూర్తి, హెచ్ ఎం రాజన్న, స్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు.



జటంగి రామేశ్వర పాఠశాలలో..

సిరుగుప్పలో..

సిరుగుప్ప (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గౌసియా బేగం ఆధ్వర్యంలో 70వ కర్ణాటక రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడ పవన్‌కుమార్ బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున, సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ మడ్డేరు సిద్దయ్య, గురప్ప, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో..

చారిత్రక విశేషాలకు నిలయం రాయచూరు

● జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శరణప్రకాశ్ పాటిల్



రాయచూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చారిత్రక విశేషాలు పురాతన కట్టడాలు తదితర వాటితో తనకంటు విశిష్ట స్థానం దక్కించుకున్న రాయచూరు జిల్లా చారిత్రకంగా ప్రత్యేకతను సంతరించుకుందని రాయచూరు జిల్లా ఇంచార్జ్ మంత్రి డా.శరణప్రకాశ్ పాటిల్ అన్నారు. 70వ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నగరంలోని మహాత్మగాంధీ క్రీడామైదానం వద్ద కన్నడ నాడు జాతీయ జెండాను ఎగరవేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సమైక్యత, సమగ్రతలకు ప్రతీకంగా నిలిచిన కన్నడ ప్రజలు దేశంలోను అంతర్జాతీయ స్థాయిలోను తమకంటు ఒక ప్రత్యేక స్థానాన్ని నిలుపుకున్నారని దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు. సాహిత్య రంగంలోను కన్నడ ప్రజలు తమదైన ముద్ర వేసుకున్నారని కన్నడ సాహితీవేత్తలకు 8 మందికి జ్ఞానపీఠ అవార్డులు రావడమే ఇందుకు నిదర్శనమన్నారు.

అవార్డు గ్రహీతకు పాత్రికేయుల సత్కారం

బళ్లారి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాజ్యోత్సవంలో అవార్డు అందుకున్న ఈనమ్మ కన్నడనాడు దినపత్రి వ్యవస్థాపకులు, ఎడిటర్ గంగాధర్ గౌడను బళ్లారి జర్నలిస్టులు ఘనంగా సత్కరించారు. గంగాధర గౌడ మాట్లాడుతూ పత్రికలు సమాజంలో మంచిని సూచిస్తాయని, అలాగే భాషను తరతరాలకు అవలరిచే విదంగా పనిచేస్తాయని అన్నారు. సన్మానించిన వారిలో వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్, వీడియో, ఫొటో జర్నలిస్టులు ఉన్నారు.



గంగాధర గౌడను సన్మానిస్తున్న పాత్రికేయులు

హోసూరు జోన్

డీఎంకే కార్యవర్గ సమావేశం



సమావేశంలో పాల్గొన్న డీఎంకే పార్టీకార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు

హోసూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): హోసూరు రైల్వే రోడ్డులోని మీరమహాల్‌లో కృష్ణగిరి పశ్చిమ జిల్లా డీఎంకే కార్యనిర్వాహకుల సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రి చక్రపాణి పాల్గొని మాట్లాడారు. డీఎంకే రాష్ట్ర అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కే స్టాలిన్ ఆదేశాల మేరకు డీఎంకే యువజన కార్యదర్శి, ఉప ముఖ్యమంత్రి ఆహార సరఫరా మంత్రి ఉదయనిధి సలహా మేరకు చెన్నైలో జరిగిన జిల్లా కార్యదర్శుల సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలపై సమావేశం నిర్వహించారు. వెనుకబడిన వారికి మహిళా హక్కులను అందించడంపై డీఎంకే ప్రభుత్వ ప్రణాళికలను ప్రజలకు చేరవేయడానికి కృషి చేయాలని సూచించారు. 2026 శాసన సభ ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాలను గెలవడానికి అన్ని నియోజకవర్గాల్లో డీఎంకే కార్యనిర్వాహకులు గెలిచేలా కృషి చేయాలన్నారు. అన్ని కార్యనిర్వాహకులు ఎస్ఐఆర్ గురించి అప్రమత్తంగా ఉండాలని, యూనియన్ ప్రాంతాల్లో బూత్‌లవారీగా సమావేశాలు నిర్వహించాలని ఆయన సూచనలు ఇచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యే వై ప్రకాశ్, మేయర్ సత్య , డిప్యూటీ మేయర్ ఆనందయ్య, ముఖ్య కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు ఎల్లోరమణి, మాదేశ్వరన్, కోశాధికారి సుకుమారన్, యూనియన్ కార్యదర్శి గజేంద్ర మూర్తి, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ అధ్యక్షతన గ్రామసభ



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

హోసూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా బర్గూరు పంచాయతీ యూనియన్‌లోని అంజూర్ పంచాయతీలో కలెక్టర్ దినేశ్‌కుమార్, బర్గూరు ఎమ్మెల్యే మదియళగన్ అధ్యక్షతన గ్రామసభ శనివారం జరిగింది. తమిళనాడు ముఖ్యమంత్రి నవంబరు 1న 2022లో స్థానిక ప్రభుత్వ దినోత్సవంగా ప్రకటించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలను చేరుకోవడానికి, గ్రామ పంచాయతీల పరిపాలనలో ప్రజలను భాగస్వామ్యం చేయడానికి ప్రజల్లో అవగాహన కల్పించడానికి స్థానిక ప్రభుత్వ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. కృష్ణగిరి జిల్లాలో 333 గ్రామ పంచాయతీలలో గ్రామసభ సమావేశాలు జరిగాయి. సమావేశంలో గ్రామ పంచాయతీ పరిపాలన, ప్రజా వ్యయం, గ్రామ పంచాయతీ యొక్క ఆడిట్, గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయడానికి తీసుకోవలసిన చర్యలు తదితర అంశాలపై చర్చలు జరిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏడిస్ దోమల ద్వార వ్యాప్తి చెందుతున్న డెంగ్యూ జ్వరాన్ని నివారించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈశాన్య రుతుపవనాల వల్ల కలిగే నష్టాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, 2024-25 సంవత్సరానికి రాష్ట్ర నిధుల క్రింద, అన్ని గ్రామాల పునరుజ్జీవన పథకం క్రింద నీటిపారుదల చెరువుల పునరుద్ధరణకు ఎంపిక చేసిన పనుల పురోగతి, స్వచ్ఛభారత్ మిషన్ ప్రాజెక్టుపై చర్చించారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కవిత, అసిస్టెంట్ డైరెక్టర్ మహదేవన్, జాయింట్ డైరెక్టర్లు ఇందిర కాళీముత్తు, హొగనేకల్ త్రాగునీటి ప్రాజెక్టు ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ గోవిందప్ప, తహసీల్దార్ చిన్నస్వామి, బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారులు సెందిల్, కుమరేశన్, డిప్యూటీ తహశీల్దార్ అమ్ము, పంచాయతీ కార్యదర్శి గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

నీటిలో మునిగి బాలుడి మృతి

హోసూరు(క్రైం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బాగలూరులోని అంబేడ్కర్ నగర్ ప్రాంతంలో నివసిస్తున్న పాండియన్ కుమారుడు మణిశంకర్(13) ఓ ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. శనివారం తన స్నేహితులతో కలిసి బాగలూరులోని పట్టాలమ్మ చెరువులో స్నానం చేయడానికి వెళ్లాడు. ఆ సమయంలో బాలుడు అకస్మికంగా నీటిలో మునిగి మరణించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన బాలుడి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం హోసూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాగలూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా కార్తీక పూజలు

కంప్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. శనివారం ఏకాదశి పురస్కరించుకుని ఆలయంలో భక్తులు దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో జ్యోతులు వెలిగిస్తూ మొక్కులు సమర్పించుకున్నారు. హంపి విరూపాక్షేశ్వరుడి సన్నిధిలో భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు సమర్పించుకుంటున్నారు. సోమవారం కార్తీక దీపోత్సవానికి అర్చకులు విశేష ఏర్పాట్లు చేపట్టారు.



ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు